# కూల్‌గా ముంచేస్తున్నారు!

- కల్తీ ఐస్‌తో అనారోగ్యం
- ప్రమాణాలు పాటించని పలువురు తయారీదారులు
- సక్రమంగా పర్యవేక్షించని అధికారులు
- ఆస్పత్రి పాలవుతున్న ప్రజలు


బాక్సులో ఉన్న ఐస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు, దాహార్తి తీర్చుకునేందుకు చాలామంది జ్యూస్ సెంటర్లు, చల్లని పానీయాలు విక్రయించే షాపులను ఆశ్రయిస్తున్నారు. అయితే అక్కడ వినియోగించే ఐస్ నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉంటోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు తయారీదారులు అపరిశుభ్రమైన నీటితోనే ఐస్ తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఆరోగ్యశాఖ, ఆహారకల్తీ నిరోధకశాఖ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఐస్‌లో రెండు రకాలు..

వాస్తవంగా ఐస్‌ను రెండు రకాలుగా తయారు చేస్తుంటారు. వాటిలో ఒకటి ఎడిబుల్ ఐస్. ఇది చిన్నచిన్న క్యూబ్స్ మాదిరిగా ఉంటుంది. ఎక్కువగా స్టార్ హోటళ్లలోనే దీనిని వినియోగిస్తుంటారు. దీనిని తినే ఆహార పదార్థాలు, పానీయాల్లో వినియోగించవచ్చు. రెండోది నాన్ ఎడిబుల్. పెద్ద పెద్ద దిమ్మలుగా ఈ ఐస్‌ను తయారు చేస్తారు. దీనిని కేవలం ఆహారం, చేపలు, మాంసం లాంటివి నిల్వ ఉంచేందుకే వాడుతుంటారు. తినేందుకు నాన్ ఎడిబుల్ ఐస్ అస్సలు పనికి రాదు. కానీ ఈ దిమ్మల రూపంలో దొరికే ఐస్‌నే చాలా మంది వ్యాపారులు జ్యూస్‌లు వంటి పానీయాల్లో వాడేస్తున్నారు. చాలా తక్కువ ధరకు దొరకడమే ఇందుకు కారణం. క్యూబ్స్ రూపంలో ఉండే ఎడిబుల్ ఐస్‌ను ప్రత్యేకంగా కుటీర పరిశ్రమలుగా ఏర్పడి చాలా జాగ్రత్తల మధ్య తయారు చేస్తారు. ఇళ్లలో ఉండే రిఫ్రిజిరేటర్ల లాంటి పరికరాల్లో ఈ ఐస్ క్యూబ్స్‌ను తయారు చేస్తారు. సాధారణ ఐస్ దిమ్మలతో పోలిస్తే ఈ క్యూబ్స్ ధర కనీసం ఐదారు రెట్లు అధికంగా ఉంటుంది.

### ఆ ఐస్ హానికరం..

శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో, నేషనల్ హైవేలో రోడ్డు పక్కన కుప్పలుతెప్పలుగా శీతల పానీయాలు విక్రయించే దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. ప్రతిచోటా పానీయంలో తప్పనిసరిగా ఐస్ వేసి ఇస్తుంటారు. అసలు ఐస్ లేకుండా ఇస్తే కొనుగోలుదారులు సైతం తాగేందుకు ఇష్టపడటం లేదు. అందుకే ఐస్ వినియోగం వేసవిలో భారీగా పెరిగింది. 99 శాతం మంది వ్యాపారులు వినియోగించే ఐస్ తినేందుకు, తాగేందుకు పనికిరాదు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఉన్న పలు ఐస్ ఫ్యాక్టరీల్లో బోరు నుంచి తీసిన కలుషిత ఉప్పు నీటినే వినియోగిసున్నట్లు సమాచారం. ఏటా ఆహార భద్రత తనిఖీ అధికారుల నామమాత్రంగా తనిఖీలు చేసి ఊరుకోవడంతో కల్తీ ఐస్ తయారీదారుల్లో ఎటువంటి చలనం ఉండటం లేదు.

### ఆస్పత్రి పాలవుతున్న బాధితులు..

ఇటీవల కాలంలో పెరిగిన ఎండవేడికి ఐస్‌వాటర్, జ్యూస్‌ల వినియోగం పెరిగింది. ఇదే స్థాయిలో వారం రోజులుగా గొంతునొప్పి, జ్వరం బారినపడుతూ ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువైంది. రహదారుల పక్కన బండ్లపై అమ్మే పండ్ల జ్యూస్, చెరకు రసాలు, నిమ్మ సోడా, షరబత్ లాంటివి తాగడంతో శరీరం చల్లబడినట్టుగా హాయిగా అనిపిస్తుందని, అయితే కలుషిత ఐస్ వల్ల తాత్కాలికంగా శరీరం చల్లబడి ఉపశమనం కలిగినా గంటల వ్యవధిలోనే దాని దుష్ప్రభావం శరీరంపై పడుతోంది. ఫలితంగా గొంతునొప్పి, జ్వరం వంటి వ్యాధులు చుట్టుముడుతున్నాయి.

### రోగాలు ఖాయం..



కలుషిత ఐస్‌తో చేసిన పానీయాలు తాగడం ప్రమాదకరం. ముఖ్యంగా గొంతు, చెవి, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారు వీటికి దూరంగా ఉండాలి. లేకపోతే గొంతునొప్పి, జలుబు, నిమోనియాతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. కూలింగ్‌లేని నీటిని మాత్రమే తాగాలి. చల్లని పదార్థాలు తీసుకోవడం వల్ల గొంతు ఎర్రబారిపోవడం, జలుబు, దగ్గు, జ్వరం, తుమ్ములు, తలనొప్పి వంటి లక్షణాలు వస్తాయి. వర్షాలు పడటం మొదలైన వెంటనే జ్వరం, గొంతునొప్పి వంటివి వచ్చే ప్రమాదముంది. ప్రజలంతా జాగ్రత్తలు పాటిస్తూ మంచి ఆహార పదార్థాలను మాత్రమే స్వీకరించాలి.

– డాక్టర్ చక్కా నారాయణరావు, గొంతు, చెవి వ్యాధులు నిపుణుడు, శ్రీకాకుళం

## క్లుప్తంగా

### నేడు మండల సర్వసభ్య సమావేశం

గార : మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.కల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకానుండటంతో అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో పాల్గొనాలని కోరారు.

### కూర్మనాథున్ని దర్శించుకున్న జిల్లా జడ్జి


కూర్మనాథుని సన్నిధిలో జడ్జి హిమబిందు

గార : శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు కుటుంబసభ్యులతో కలసి గురువారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌కు పూజలు చేసి లక్ష్మీసన్నిధిలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలియజేశారు. ఈవో జి.గురునాథం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

### ట్రాఫిక్ క్రమబద్ధీకరణ


కంటైనర్‌పైకి లారీని ఎక్కిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: విశాఖపట్నం వైపు వెళ్తున్న బొగ్గులోడు లారీ అదుపుతప్పి ఇనుప కంచె చీల్చుకొని ఈ నెల 28వ తేదీన కింతమిల్లు వద్ద బోల్తా పడింది. సర్వీస్ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం బొగ్గును వేరే వాహనంలోకి లోడింగ్ చేశారు. క్రేన్‌తో లారీని తొలగించి కంటైనర్‌పై ఎక్కించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

### పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ ఉషాకుమారి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం రైతుభరోసా కేంద్రంలో గురువారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేసే గుమ్మడి వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ ప్రసాద్‌లకు 12 కేజీల జీలుగ విత్తనాలను మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి అందజేశారు. రాయితీపై విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

### లలితాదేవికి ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న లలితాదేవి అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని దోమాం పంచాయతీ కుంచాలకుర్మయ్యపేటలోని లలితాదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక నిర్వహించారు. ఆలయ అర్చకులు వంశీకుమార్‌శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త నర్సింగరెడ్డి, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### ధ్యానంతో మానసిక ప్రశాంతత

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థి దశ నుంచే యోగ, ధ్యానం అలవర్చుకోవాలని బలగ గ్రంథాలయశాఖ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. బలగ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం చిన్నారులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో నీతి కథలు చెప్పించారు.

# ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం


ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కివలసలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కేంద్రంలోనూ, అరిణాంఅక్కివలస నాగార్జునా అగ్రికెం పరిశ్రమ ఆవరణలోనూ సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. సీఐటీయూ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఆవిష్కరించారు. కార్మికులు ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాటం చేస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. సీఐటీయూ 1970లో ఏర్పాటైన నాటి నుంచి కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తుందన్నారు. కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**కార్మికుల హక్కుల కోసం పోరాటం..**


రణస్థలం: యుబీ పరిశ్రమ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న అమ్మన్నాయుడు

రణస్థలం: కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంటుపల్లి వద్ద గల యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ ఎదుట సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా విశాల కార్మికవర్గ ఐక్యత కోసం సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస:

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, నాలుగో స్థానాలు కైవశం చేసుకుని సత్తా చాటారు. మణికొండ అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం ఓ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని తమ్మినేని సృజన ప్రథమ బహుమతి రూ.25,000, తొమ్మిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ నాలుగో స్థానం సాధించి రూ.12,000 నగదు బహుమతి పొందారు. వీరికి పాఠశాల హెచ్‌ఎం బి.రామకృష్ణ, ఉపాధ్యాయులు గోపీకృష్ణ తదితరులు అభినందించారు.

# 2న వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం జూన్ 2న నిర్వహించనున్నట్లు అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారి నిజరూప దర్శనం క్షీరాభిషేకాలు జరుగుతాయని, సాయంత్రం వైదిక సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి కల్యాణోత్సవం జరుగుతుందని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

# వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

రణస్థలం: మండలంలోని బంటుపల్లి సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న రాధాగోవింద మందిర ప్రథమ వార్షిక మహోత్సవ కార్యక్రమం వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య గురువారం ఘనంగా జరిగింది. భక్తులు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాధాగోవింద సేవా భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు


పుష్పాభిషేకంలో రాధాగోవిందులు

# భక్తులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: విశాఖ–బీ కాలనీలోని షిరిడీ సాయి మందిరంలో మారుతీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోరాడ విశ్వనాథం సౌజన్యంతో గురువారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర కమిటీ చైర్మన్ మధు విలేకరి, క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్‌లు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున మందిరానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి రంగారావు, అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు, క్లబ్ కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి పి.నారాయణమూర్తి, కమిటీ సభ్యులు శ్రీదేవి, శివన్నాయుడు, శ్రీనివాసరావు, విశ్వనాథం, హైమ, సత్యవతి, సత్యం పాల్గొన్నారు.

# హనుమాన్ చాలీసా పారాయణం


వయొలిన్ దుర్గారాజును సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జెడ్పీ ఎదురుగా ఉన్న షిరిడీసాయి ఆలయంలో హనుమద్వైభవం సప్తాహ దినోత్సవాల సందర్భంగా 5వ రోజు కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం మూలమంత్ర హవనం, హనుమాన్ చాలీసా పారాయణం, రామాయణం పారాయణ, సుందరకాండ పారాయణం నిర్వహించారు. సాయంత్రం రామకోటి లేఖన యజ్ఞం, ఆంజనేయ స్వామి అష్టోత్తర శత పూజ జరిగాయి. అనంతరం నిర్వహించిన వరద దుర్గారాజు వయొలిన్ కచేరి, భాస్కరభట్ల శ్రీరామశర్మ ఉపన్యాసం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బలిజేపల్లి ప్రసాదరావు, మందుల మోహన్‌రావు, లక్ష్మణరావు, గొంటి పాపారావు, రమాదేవి, బలిజేపల్లి కమల పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు తప్పనిసరి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అనూష

శ్రీకాకుళం రూరల్ : భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వినియోగిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త అనూష అన్నారు. పచ్చిరొట్ట విత్తనాల వల్ల కలిగే ప్రయోజనాలపై కృషి విజ్ఞానకేంద్రం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్లేపల్లిలోని రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసరు విత్తుకొని 50 శాతం పూతదశ తరువాత నేలలో బాగా కలియదున్నాలన్నారు. దీనివల్ల భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం రిలయన్స్ ఫౌండేషన్ తరపున రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించారు.

# సనాతన ధర్మం అనుసరణీయం


గణేష్ గురూజీ సన్మానిస్తున్న దృశ్యం

గార: శ్రీకృష్ణుని నామస్మరణ అమృతమని బాలత్రిపురసుందరి కాలభైరవ పీఠాధిపతి గణేష్ గురూజీ అన్నారు. జొన్నలపాడు కాలనీ సమీపంలోని బృందావనంలో గురువారం బహుళష్టమి, అన్నమాచార్య జయంతి పక్షోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అర్చనలు, భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ గురూజీ మాట్లాడుతూ స్వామిని నవవిధ భక్తి మార్గాలలో కొలవవచ్చన్నారు. నామస్మరణ ద్వారా మోక్షం పొందవచ్చని చెప్పారు. సనాతనధర్మం గొప్పతనాన్ని అందరూ అనుసరించాలన్నారు. అనంతరం పాతపట్నం పొన్నాడ వెంకటరమణ బృందం ఆలపించిన కీర్తనలు అందరినీ అలరించాయి. చౌదరి దుర్గారావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సింహాద్రి శ్రీనివాసరావు, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, ఎ.చక్రధరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించాలి


బహుమతులతో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రీసోర్స్‌పర్సన్ తంగి కృష్ణ అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భవిష్యత్తు తరాలకు కలుషితం లేని నీరు, గాలి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

# చిత్రలేఖనంలో శిక్షణ


మెలకువలు నేర్పిస్తున్న ఈశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరావు, ఈశ్వర్ ఆర్ట్స్–డిజిటల్ సంస్థ సంఘ సేవకులు ఈశ్వరరావు అవగాహన కల్పించారు. 50 మంది విద్యార్థులకు చిత్రలేఖనంతో పాటు గణితంలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా పాల్గొన్నారు.

### షిర్డీసాయికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం సాయిదర్బార్‌లో షిర్డీసాయినాథునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో స్వామికి ఉదయం కాకడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగాయి. హౌసింగ్ బోర్డు కాలనీలోని షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో షిర్డీసాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు, మూడు రకాల హారతులు, వస్త్రాలంకరణ సేవ, పుష్పాలంకరణ సేవ నిర్వహించారు.

### నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

టెక్కలి రూరల్ : నర్సింగపల్లి గ్రామానికి చెందిన జి.అప్పలస్వామి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో నర్సింగపల్లి సేవాసంఘం సభ్యులు రూ.11 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు యన్ని షణ్ముఖరావు గురువారం తెలిపారు. నిరుపేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.